Andhra Bhoomi DT 01/02/14



# పటాన్‌చెరు వరకు పొడిగించండి

## ★ మెట్రోరైలు ఎండికి బిజెపి నేతల బృందం వినతి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: మహానగరంలో రోజురోజుకి పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన హైదరాబాద్ మెట్రోరైలు కారిడార్ 1ను పటాన్‌చెరు వరకు, ఆ తర్వాత సంగారెడ్డి వరకు పొడిగించాలని బిజెపి నేతలు కోరారు. బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే డా.కె.లక్ష్మణ్ నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే బద్దంబాల్‌రెడ్డిలతో కూడిన బృందం శుక్రవారం మెట్రోభవన్‌లో మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ శివార్లలో రోజురోజుకి పెరిగిపోతున్న పట్టణీకరణ నేపథ్యంలో మెట్రోరైలును పటాన్‌చెరు వరకు, ఆ తర్వాత సంగారెడ్డి వరకు పొడిగిస్తే ప్రజలకు మరిన్ని ఇబ్బందులు దూరమవుతాయని వివరించినట్లు తెలిపారు. తొలుత మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు పొడిగించి, ఆ తర్వాత సంగారెడ్డి వరకు పొడిగించేందుకు వీలుగా ప్రతిపాదనలు తయారు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఇందుకు సానుకూలంగా స్పందించిన మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి ఘన మెట్రోరైలు ప్రాజెక్టు ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైందని, పిపిపి ప్రాతిపదికన నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును మరిన్ని ప్రాంతాలకు పొడిగించాలని చాలా వినతులు వచ్చినట్లు వివరించారు. కారిడార్ 1ను మియాపూర్ నుంచి పటాన్‌చెరువుకు పొడిగించాలని కోరటం అభినందనీయమన్నారు. అంతేగాక, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు పెంచే అంశంపై అధ్యయనం నిర్వహించి, ప్రజల సౌకర్యార్థం అధ్యయన నివేదికతో పాటు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని సమాధానం చెప్పినట్లు వారు వివరించారు.

### మెట్రో రైలు సంగారెడ్డి వరకు పొడిగించాలని పాదయాత్ర

**శేరిలింగంపల్లి:** మెట్రో రైలు మార్గాన్ని మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు పొడిగించాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. శుక్రవారం రామచంద్రాపూరం, బిహెచ్ఇఎల్ జంక్షన్, చందానగర్, మియాపూర్ వరకు కొనసాగింది. సంగారెడ్డి వరకు పొడిగించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని బిజెపి నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బద్దం బాల్‌రెడ్డి, భీంరావు, కుర్ర సత్యనారాయణ, కాసాల బుచ్చిరెడ్డి, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాచమళ్ల నాగేశ్వర్‌గౌడ్, వసంత్ కుమార్ యాదవ్, పొరెడ్డి బుచ్చిరెడ్డి, చింతకింది గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.





కారిడార్ 1ను పటాన్‌చెరు వరకు పొడిగించాలని మెట్రోరైలు ఎండి డా.ఎన్వీఎస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బిజెపినేతలు, పాదయాత్రలో పాల్గొన్న బాల్‌రెడ్డి, భీంరావు